క్లుప్తంగా

ఘనంగా సచివాలయ వార్షికోత్సవం



కేక్ కట్ చేసి పంచుతున్న సచివాలయ అడ్మిన్

నగరి : పట్టణ పరిధిలోని కోంమిట్ట సచివాలయంలో సిబ్బంది సోమవారం సచివాలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సచివాలయ వ్యవస్థ వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అందరికీ స్వీట్లు పంచారు. అక్టోబర్ 2వ తేదీ రాష్ట్ర యువతకు ఉపాధిమార్గం చూపిన రోజుగా వారు అభివర్ణించారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ భాస్కర్, సిబ్బంది కెన్ని, వేలాయుధం, సురేష్‌బాబు, రేఖ, సంగీత, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛన్ అందజేత



లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

నగరి : పింఛన్‌దారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా, వలంటీర్లు వారిని వెతుక్కుంటూ వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం దళితవాడకు చెందిన సాంబశివం తీవ్ర అస్వస్థతకు లోనై తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసి వలంటీర్ కుమార్ సోమవారం తిరుపతి స్విమ్స్‌కు వెళ్లి పెన్షన్ అందించాడు. చికిత్స పొందుతున్న సాంబశివం ఈ సందర్భంగా వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

భక్తులకు అన్నదానం



ఆలయం వద్ద అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

నగరి : మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ అనుబంధంగా ఉన్న అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయానికి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎం.కొత్తూరు గ్రామానికి చెందిన శంకర అనే దాత అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో..



వృద్ధులకు అన్నదానం చేస్తున్న హేమప్రియదర్శిని

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు హేమ ప్రియదర్శిని జన్మదినం సందర్భంగా సోమవారం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా హేమ ప్రియదర్శిని కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. అలాగే పండ్లు, స్వీట్లు అందించారు. అనంతరం హేమప్రియదర్శిని తండ్రి కిరణ్ కుమార్ మాట్లాడుతూ తమ కుమార్తె పుట్టిన రోజు ఏటా వృద్ధులకు అన్నదానం చేయడం, పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరుణగిరిపై ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశ్వరుడికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మహాత్ముడి ఆశయ సాధనే లక్ష్యం

- వాడవాడలా గాంధీ జయంతి
- పలుచోట్ల అన్నదానం

నగరి : మహాత్ముడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. సోమవారం గాంధీ జయంతి వేడుకలను నగరి, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. దేశస్వాతంత్య్రం కోసం ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారన్నారు. ప్రధాని ప్రవేశపెట్టిన సఫాయి మిత్ర సురక్ష సివిర్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఏడుగురు శానిటరీ ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి వారికి దుస్తులు, యూనిఫాం, గ్లౌజులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భార్గవి గాంధీ చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్ చంద్రకళ, నాయకులు పాల్గొన్నారు. పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



నగరి: మున్సిపల్ కార్యాలయం వద్ద దుస్తులు అందుకున్న పారిశుద్ధ్య కార్మికులతో చైర్మన్, కమిషనర్

గాంధీ పేరిట రోగులకు సాయం..

పుత్తూరు రూరల్: గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వారు సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు సంఘ భవనంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండలవ్యాప్తంగా దేశ జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించారు. నింద్రలోని ఎంపీడీఓ కార్యాలయం, జిల్లా ఉన్నత పాఠశాల, కర్పరవేడు, శ్రీరామాపురం, ఆరూరు గ్రామ సచివాలయాల్లో, గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మండలవ్యాప్తంగా గాంధీజీ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కత్తెరపల్లి సచివాలయంలో సర్పంచ్‌లు నవీన, గుణవతి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సర్పంచ్ నవీన మాట్లాడుతూ గాంధీ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే మండల పరిధిలోని 15 సచివాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీజీ జయంతి నిర్వహించారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె, పాతగుంట గ్రామ సచివాలయాల పరిధిలో సర్పంచ్‌లు పుష్ప, భువనేశ్వరి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కోమల ఆధ్వర్యంలో గాంధీకి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీడీఓలు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : సత్యం, అహింస అనే ఆయుధాల ద్వారా గాంధీజీ దేశానికి స్వాతంత్య్రం సాధించి పెట్టారని, ఆయన అడుగు జాడలో మనమంతా నడవాలని సర్పంచ్ శోభ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సర్పంచులు గాంధీ జయంతిని వేడుకగా జరుపుకున్నారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు ఘన నివాళులు చేశారు. బాలకృష్ణాపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ శోభ, మండల విస్తరణాధికారి రమేష్ జాతిపిత గాంధీ చిత్రపటాన్ని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రం చేయడానికి గ్రీన్ అంబాసిడర్లు సేవలు ఎనలేనివని తెలిపారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లకు దుశ్శాలువలతో సన్మానించారు.



నగరి : ఎంపీడీఓ కార్యాలయంలో ..



నగరి: పీసీఎన్ ఉన్నత పాఠశాలలో..

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): గాంధీ దేశానికే ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పెనుమూరు చెక్‌పోస్టు వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల యువత ఉపాధ్యక్షుడు రోహిణి, మోహన్‌శెట్టి, యుగంధర్ పాల్గొన్నారు.







రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న సంఘ నాయకులు, కత్తెరపల్లి సచివాలయంలో.., వెదురుకుప్పం: పాతగుంట పంచాయతీ కార్యాలయం వద్ద.., పాలసముద్రంలో గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న శోభ, రమేష్, పెనుమూరులో గాంధీ విగ్రహం వద్ద నివాళులు

సంక్షేమ ప్రభుత్వానికి జన నీరాజనం

- ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు లబ్ధి చేకూర్చాం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం అన్నూరు సచివాలయ పరిధిలోని ఇందిరా కాలనీ, అల్లాగుంట, మిట్టదళితవాడ, చౌటూరు, కృష్ణసముద్రం, అన్నూరు, ఉప్పరపల్లి, శెట్టిగుంట గ్రామాల్లో సర్పంచ్ సుందర్‌రాజ్, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజల సమస్యలను ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు పూలవర్షంతో నీరాజనలు పలుకుతున్నారని ఇదంతా పేద ప్రజలకు సీఎం వైఎస్ జగనన్న అందిస్తున్న సంక్షేమాలతోనే సాధ్యమైందన్నారు. నేడు దేశం మొత్తం ఆంధ్రరాష్ట్రం వైపు చూస్తున్నాయంటే జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు వంటి చారిత్రక ఆలోచనలేనని, ఎన్నడూ లేనివిధంగా మన రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇల్లు లేని వారిని గుర్తించి వారికి నివేశ స్థలాలు కేటాయించి పక్కాగృహాలు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఇళ్లపై వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించి సమస్య పరిష్కరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందిరా కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన మంత్రి వెంటనే రోడ్డుకు కావాల్సిన స్థలాన్ని కొనుగోలు చేసి రోడ్డు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు. రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు లేని వారికి వెంటనే కార్డులు మంజూరు చేయాలని, గ్రామాల్లో మట్టి రోడ్లు తావు లేకుండా సీసీ రోడ్ల నిర్మాణం చేయాలన్నారు.



అల్లాగుంటలో క్రేన్‌తో మంత్రి నారాయణస్వామికి గజమాల వేస్తున్న నాయకులు

మంత్రికి క్రేన్ సాయంతో గజమాల..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం సర్పంచ్ సుందర్‌రాజ్ క్రేన్ సహాయంతో గజమాలను వేసి ఘనంగా సత్కరించారు. అలాగే మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ ఏకాంబరం మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించి ఆహ్వానించారు.

30 ఏళ్ల కల నెరవేరింది..

గత ముప్పై ఏళ్ల కిందట కృష్ణసముద్రం గ్రామస్తులకు 79 మందికి పట్టాలు మంజూరు చేశారు. స్థలం చూపించలేదు. ఎన్ని ప్రభుత్వాలు మారిన సమస్యను పట్టించుకున్న నాథుడు లేరు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో నేడు పట్టాలతో పాటు స్థలాలను కేటాయించడంతో గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండా ఉప ముఖ్యమంత్రిని గ్రామస్తులు పూలవర్షంతో ముంచెత్తారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనుంజయవర్మ, విశ్రాంత తుడాప్లానింగ్ అధికారి కృష్ణారెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అమీద్, శేఖర్, డిల్లీ, గోపి, వరదరాజులురెడ్డి, దొరైరాజ్, రాంబాబురెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, ఎంపీడీఓ మోహన్‌మురళి, విద్యుత్ ఏడీఈ నాగరాజు, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



కృష్ణసముద్రంలో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని ఐటీఐ(పారిశ్రామిక శిక్షణ సంస్థ)లో 2023–24 సంవత్సరానికి గాను 5వ విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ భైరవుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వివిధ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న వాటి కోసం ఈనెల 7తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8న మధ్యాహ్నం లోపు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లను వెరిఫికేషన్ చేసుకుని 9న జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9533723022, 9492571731 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మునికృష్ణయ్య సేవలు మరువలేనివి



మునికృష్ణయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: ప్రభుత్వ పరంగా ఆలయాలకు మునికృష్ణయ్య చేసిన సేవలు మరువలేమని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆయన ఆకస్మిక మృతి తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. పుత్తూరు శ్రీసదాశివేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న మునికృష్ణయ్య సోమవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలియగానే మంత్రి రోజా తిరుపతికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

‘బండారు’ దిష్టిబొమ్మ దహనం



పుత్తూరులో బండారు సత్యనారాయణ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పుత్తూరు రూరల్: పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను అనుచితంగా మాట్లాడిన టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణ దిష్టిబొమ్మను సోమవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఏ.హరి మాట్లాడుతూ టీడీపీ హయాంలో జరిగిన అవినీతి కుంభకోణాలు ఒక్కొక్కటి బయట పడుతుండడంతో తట్టుకోలేని టీడీపీ నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే ఎంతటి వారికైనా తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బండారు సత్యనారాయణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన దిష్టి బొమ్మను స్థానిక మహిళలు చెప్పులతో కొట్టి ఊరేగించారు. అనంతరం దిష్టి బొమ్మకు నిప్పు అంటించి దహన సంస్కారాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, కౌన్సిలర్లు వనిత, రాజేశ్వరి, భానుమతి, షకీలా, ఏకాంబరం, చిట్టిబాబు, గుణ, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందస్వామిరెడ్డి, ప్రసాద్, మనోహర్‌రెడ్డి, లారీమోహన్, రమేష్‌బాబు, మురళీయాదవ్, ఈశ్వరయ్య, సుదర్శనం, లక్ష్మణమూర్తి, తిరునావక్కరుసు, వెంకటేష్, శంకర్, భూపతి, తంగవేలు, జ్యోతి, మనోజ్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం సాకారం



రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సీఎం జగనన్నతోనే సాధ్యమైందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం అన్నూరులో రూ.61.80 లక్షలతో నిర్మాణం చేపట్టిన రైతుభరోసా కేంద్రం, సచివాలయ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ నాడు గాంధీజీ కన్న కలలను నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న నెరవేరుస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులో తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు రాయితీపై విత్తనాలు, ఎరువులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. అనంతరం ఆయన పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ జయచంద్రారెడ్డితో కలసి సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం గాంధీ జయంతిని పురస్కరించుకుని గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పుట్టుకతో ఎవరూ నేరస్తులు కారు



మాట్లాడుతున్న జడ్జి రామచంద్రుడు

తిరుపతి లీగల్: పుట్టుకతో ఎవరూ నేరస్తులు కారని తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి టి.రామచంద్రుడు తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని తిరుపతి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి సబ్ జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి రామచంద్రుడు మాట్లాడుతూ నేర ప్రవృత్తిని విడనాడి మంచి మార్గంలో నడవాలని ఖైదీలకు సూచించారు. అప్పుడే కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అంతకుముందు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం నిర్వహించే సంకటహర గణపతి చతుర్థి వ్రతంలో ఉదయం ఉత్సవ మూర్తులను అలంకార మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంకటహర గణపతి చతుర్థి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున వ్రత పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ తాజా మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



వ్రతం ఆచరిస్తున్న భక్తులు